వట్టిపల్లి పంచాయతీ రికార్డులు పరిశీలించిన డిఎల్‌పివో

రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ లత

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామపంచాయతీని జిల్లా పంచాయతీ అధికారిణి లత, మండల పంచాయతీ అధికారి ఎండి.ఖాజా మొయినొద్దీన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీకి సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. గ్రామంలో అపరిశుభ్రత వాతావరణం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భానుచందర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు బండి నర్సింలు ఎంపిక

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : గుజరాత్ రాష్ట్రంలో మార్చి 3న జరిగే జాతీయ స్థాయి ఈత పోటీలకు సిద్దిపేట జిల్లావాసి బండి నర్సింలు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఈవి నరసింహ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు బండి నరసింహులు జాతీయస్థాయి క్రీడా పోటీలలో విజేతగా నిలిచి డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకరావాలని ఆయన అభినందించారు.

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఈవి నరసింహారెడ్డిని కలిసిన నర్సింలు

అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ అమీద్

వందశాతం పన్నులు వసూలు చేయాలి

అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

చేర్యాల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : చేర్యాల మున్సిపల్ పరిధిలో బకాయి ఉన్న పన్నులను వందశాతం వసూలు చేయాలని అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్,మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ అధికారులకు తెలిపారు. మంగళవారం చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో అధికారుల, సిబ్బంది తో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వాటర్ సప్లై, ఇంటి పన్నులు, లైసెన్సులు, నీటి పన్నుల గురించి అడిగి తెలుసుకుని వందశాతం పన్నులు వసూలు చేయాలని అధికారులకు ఆయన ఆదేశాలు జారి చేశారు. సమావేశంలో కమిషనర్ ఎస్.నాగేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుపాయల రోడ్డును పరిశీలించిన ఎస్‌పి

ఏడుపాయలకు వచ్చే దారిని పరిశీలిస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానిమాతను దర్శించుకునేందుకు ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్‌పి ఉదయ్‌కుమార్‌రెడ్డి అలయ అధికారులకు సూచించారు. మంగళవారం ఏడుపాయల ఆలయానికి చేరుకున్న ఎస్‌పి ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆలయ పరిసరాలను, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఏడుపాయల జాతర సమీపిస్తున్న దృష్ట్యా ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు వాహనాల్లో వచ్చే అవకాశం ఉంటుందని, అందుకు భక్తులు ఇబ్బందులకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులకు ఎస్‌పి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చంద్రశేఖర్, మెదక్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మెదక్ జిల్లాలో 5.25 లక్షల ఓటర్లు

-అదనపు కలెక్టర్ నగేష్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీ వార్డు వారి ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించడం జరిగిందని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యతో కలిసి గ్రామపంచాయతీ వార్డువారి ఓటర్ జాబితా, బ్యాలెట్ పేపర్స్, బ్యాలెట్ బాక్సుల పోలింగ్ నిర్వహణకు కావలసిన మెటీరియల్ సిద్ధం చేసుకోవడం, సంబంధిత విషయాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సంపూర్ణ అవగాహన చేయడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ జిల్లాలో 493 గ్రామ పంచాయతీలలో 5,25,478 ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుష ఓటర్లు 2,52,797 ఉండగా, మహిళా ఓటర్లు 2,72,672 మంది ఉన్నారని, అలాగే ట్రాన్స్ జెండర్స్ 09 మంది ఉన్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన ఓటర్ జాబితాను అనుసరించి గ్రామ పంచాయతీ ఓటర్ జాబితాను సిద్ధం చేయడం జరిగిందని, ఇందులో అనుబంధం 1, అనుబంధం 2 కొత్తగా అనుసంధానం చేయడం జరిగిందని, ఇట్టి విషయాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం టీఎం కాలిక్, సీపీఎం నుండి నరసమ్మ, బీఆర్ఎస్ పార్టీ ఆంజనేయులు, బీఎస్‌పీ సిద్ధిరాములు, బీజేపీ నుంచి చల్ల నరేందర్, సీపీఐ నుండి విజయలక్ష్మీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలి : పిడి హన్మంతరెడ్డి

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : మహిళా సంఘాలకు ఇచ్చిన లక్ష్యాలను మెప్మా ఆర్‌పిలు వెంటనే పూర్తిచేయాలని పిడి హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్‌తో కలసి ఆర్పీలకు రివ్యూ నిర్వహించారు. ఈనెల 25 వరకు సంఘాలకు ఇచ్చిన లక్ష్యాలతోపాటు నూతన సంఘాల ఏర్పాటు, రుణాల పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎడిఎమ్‌సి సంతోషి,టిఎమ్‌సి ముత్యాల రాజు ఉన్నారు.

మాట్లాడుతున్న పిడి హన్మంతరెడ్డి

ఉపాధి కల్పన లక్ష్యాలను మెరుగుపరుచుకోవాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి సంబంధించి ఉపాధి కల్పన లక్ష్యాలను మెరుగుపరుచుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ మండల పరిధిలోని బాలానగర్ ఏరియాలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి సంబంధించి షెడ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ యూనిట్ పెట్టడం ద్వారా రైతుకు ఆర్థిక అభివృద్ధి చేకూరే లాభనష్టాలను, వ్యాపార లావాదేవీలను స్వయంగా బి.వీణ మహిళా రైతును అడిగి తెలుసుకున్నారు. జీవాల పెంపకంలో బ్రీడింగ్ ఫారానికి మొదటి దశలో ఉన్న షెడ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసుకుని యూనిట్ ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఒక కోటి రూపాయల వ్యయంతో ఈ యూనిట్ ప్రారంభించాల్సి ఉండగా, ఇందులో లబ్ధిదారు వాటా 10 లక్షలు కాగా, బ్యాంకు రుణం 40 లక్షలు ఉంటుందని చెప్పారు. యూనిట్ సబ్సిడీ 50 లక్షలు లభిస్తుంది అన్నారు. 500 గొర్రెలు లేదా మేకలు, 35 పొట్టేళ్లు, మేక పోతులతో కూడిన బ్రీడింగ్ ఫారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వారికి నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీమ్ ఎంటర్‌ప్రైన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద కేంద్ర ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించిందన్నారు. ఔత్సాహికులు వీరు జీవాల (గొర్రెలు, మేకలు) పెంపకంలో అనుభవం కలిగి ఉండాలన్నారు.త్వరగా యూనిట్ ప్రారంభించి ఆర్థిక అభివృద్ధి దిశగా ముందుకు పోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.వెంకటయ్య, డాక్టర్లు లక్ష్మణ్, వినోద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రీడింగ్ ఫారానికి సంబంధించి షెడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

బోనం ఎత్తుకున్న జోగిని శ్యామల

విద్యుత్ దీపాలు, అమ్మవారి ప్రతిమతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కొండపోచమ్మకు పోటెత్తిన భక్తజనం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): మండలపరిధిలోని తీగుల్‌నర్సాపూర్‌లో వెలసిన శ్రీకొండపోచమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా మూడవ వారం భక్తులు వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. అమ్మవారికి భక్తులు కడవల్లో నైవేద్యం, ఒడి బియ్యంను డప్పుచప్పుళ్ల మధ్య పోతరాజుల నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు.

జాతరలో సాయియాదవ్ ధూంధాం

కొండపోచమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన బోయిని సాయియాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అమ్మవారికి ఘటాన్ని సమర్పించారు. జోగిని శ్యామల బోనమెత్తగా పోతరాజుల నృత్యాలు, డిజె చప్పుళ్ల మధ్య భారీ ఊరేగింపు కొనసాగింది.ఊరేగింపులో వివిధ అమ్మవార్ల వేషధారణలో నృత్యాలుచేస్తూ ముందుకు కదిలారు. కార్యక్రమాన్ని వీక్షించడానికి కొండపోచమ్మ ఆలయ సమీపంలో ఉన్న గ్రామ ప్రజలతో పాటు జాతరకు విచ్చేసిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మెడికల్ కళాశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: మెదక్ పట్టణంలోని పిల్లికోట్టాల్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య విద్యార్థులతో వారి విద్య భోదన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల క్యాంటీన్ నిర్వహణ, ల్యాబ్ నిర్వహణ, హాస్టల్ వసతుల గురించి ప్రిన్సిపల్ రవీంద్ర కుమార్ కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వివరించారు. విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అన్ని ఆధునిక సౌకర్యాలతో విద్య భోదన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైస్ ప్రిన్సిపాల్ డా. జయ, సూపరింటిండెంట్ శివదయాళ్, విద్యార్థిని, విద్యార్థులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధన చేసి ఆరోగ్యంగా జీవించాలి

సిద్ధియోగ జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతి ఒక్కరూ యోగ సాధన చేసి ఆరోగ్యంగా జీవించాలని..సూర్య నమస్కారాల సాధన చేయడం వలన దయ నందన జీవితం ఉల్లాసంగా ఉంటుందని సంక్షేమ సిద్ధి యోగ జిల్లా అధ్యక్షులు ప్రభుదాస్,ప్రధాన కార్యదర్శి పెద్ది మనోహర్, రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి కత్తుల బాపురెడ్డిలు అన్నారు. రథ సప్తమి పర్వదినం పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో సంక్షేమ సిద్ధి యోగ ప్రతినిధి బొజ్జ అశోక్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సూర్య భగవానుని నామాలను ఉచ్చరిస్తూ సూర్య నమస్కారాల సాధన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ సనాతన రుషి సంపద సూర్య నమస్కారాలు అని పేర్కొన్నారు. ప్రపంచానికి యోగ విద్యను భారత దేశ రుషులు పరిచయం చేశారని తెలిపారు. ఆహార విధానాల్లో మార్పులు చోటు చేసుకోవడం వలన వ్యాధుల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహార విదానాలను అవలంభిస్తూ సంతోషంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సిద్ధి యోగ ప్రతినిధులు ఎలిగేటి కృష్ణమూర్తి, జూలురి రవికుమార్, కాపర్తి రాములు, పోతుల రాజు, కడవెర్గు రమేష్, శ్రీనివాస్, సురేష్, బడ్ల భాస్కర్, భిక్షపతి, దూస శివ, దేవేందర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, సూరం పద్మజ, రోజారమణి, శారద,లావణ్యరెడ్డి, జిల్లా వనజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాలకు బిటి రోడ్లు... నెరవేరిన ప్రజల కల

టేక్మాల్, ఫిబ్రవరి, 4 ప్రభాతవార్త: ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్న సంకల్పంతో ఆందోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పట్టుబట్టి ప్రగతి పథకాలను విస్తరింప చేస్తున్నారు. గతంలో గిరిజన తండాలకు రహదారులు సరిగా లేక పోవడంతో అత్యవసర సమయల్లో మట్టిదారుల్లో వెళ్లాల్సి వచ్చేది. కొన్ని తండాలకు అంబులెన్స్ వాహనం సైతం వెళ్లలేని పరిస్థితి ఉండేది. వారి ఇబ్బందులను తెలుసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గిరిజన తండాలకు రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేయడంతో పనులు వేగవంతం చేశారు. తండాల బీటీ రోడ్ల నిర్మాణానికి ఎస్టీఎస్ డీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ చూపి నిధులను మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 2.50 కోట్లతో మంగళవారం లక్ష్మన్ తండా, వాసురాం, బాధ్యతండా నుండి చంద్రు తండా మీదుగా అచ్చన్నపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. టేక్మాల్ మండల పరిధి హసన్‌మహ్మద్‌పల్లి తండా నుంచి కడీల బాయి తండా వరకు ఉన్న ఎల్లంపల్లి మెరుగోని కుంట తండా మార్గం రోడ్లు ఉన్నాయి. ఎల్లంపల్లి నుంచి మెరుగోని కుంట తండా రోడ్డు రూ.1.6 కోట్ల నిధులు మంజూరు కాగా పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు వినియోగంలోకి వచ్చింది. అవసరమైన ప్రదేశాల్లో కల్వర్టులను సైతం నిర్మింపజేశారు. మెరుగోని కుంట తండాలో సుమారు కడీలబాయితండా నుంచి హసన్‌మహ్మద్ పల్లి వరకు వరకు సీసీ రోడ్డు నిర్మించారు. తంపూలూర్ టేక్మాల్ తారురోడ్డు నుంచి పోగుల వెంకటాపూర్ మీదుగా నీలబోయిన వాగుతండా వరకు మట్టిరోడ్డు ఉండేది. వర్షాకాలంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఈ రోడ్డు నిర్మా ణానికి రూ.1.2 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. ఎల్లుపేట నార్సింగి నుంచి షాబాద్ తండా వరకు తారు రోడ్డు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మారుమూల తండా కావడంతో అభివృద్ధికి దూరంగా ఉందని స్థానికులు వాపోయారు. రోడ్డు నిర్మాణానికి రూ. 1.5 కోట్లు మంజూరు కాగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

సాలోజిపల్లి నుంచి కాద్లూర్ తండాకు మట్టి రోడ్డును తారురోడ్డుగా నిర్మించేందుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం రోడ్డు పనులు ప్రారంభం కాగా మట్టి, కంకరవేసి చదును చేశారు. తండాలలో తారు రోడ్డు వేగవంతం చేయడంతో కాంగ్రెస్ టేక్మాల్ గిరిజన సంఘా నాయకులు సర్దార్,లాలు, చందులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో బీటీ రోడ్డు నిర్మాణం చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బీటీ రోడ్డును వేస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపాలి

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా గత సెప్టెంబర్ 28 రాష్ట్ర ఎన్నికల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా వార్డుల చొప్పున ఓటర్ జాబితాను విడుల చేయడం జరిగిందని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రిపరేషన్‌కు సంబంధించి పంచాయతీ అధికారి దేవకీదేవి,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని కారణాలతో 64 గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను ప్రచురణ చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న జిల్లాలోని 17 గ్రామ పంచాయతీల డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను తయారు చేసి ఈనెల 3న గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈనెల 5న జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సిద్దిపేట రూరల్(15 జీపీలు), కొండపాక(1 జీపీ), అక్కన్నపేట 1 జీపీ మండలాల్లో మండల స్థాయిలో రాజకీయ పార్టీల నప్రతినిధులతో సమావేశం నిర్వహించి 17 గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాను అందించడం జరుగుతుందన్నారు. 7న తేదీ జాబితను ప్రకటించడం జరుగుతుందని ఏదైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు), బిఆర్ఎస్ నాయకులు మోహన్‌లాల్, మధుసూదన్‌రెడ్డి, బిఎస్‌పి బాబు, యాదగిరి, ఉమేష్ రాజు, ఎఎపి పున్నరెడ్డి, వైఎస్ఆర్‌సిపి జగదీష్,రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితాపై సమీక్ష సమావేశం

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపిడిఓ యాదగిరి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాపై రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం జగదేవ్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ బి.యాదగిరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల వారీగా ఓటర్ల తుది జాబితాకు సంబంధించిన ఫోటో ఓటరు జాబితాను ఈనెల 3వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఓటరు జాబితాలో ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే ఈనెల 6వ తేదీ లోపు తెలియజేయాలని, 6న వచ్చిన అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారికి పంపడం జరుగుతుందని, 7న జిల్లా పంచాయతీ అధికారి తుది జాబితా విడుదల చేస్తారని అన్నారు. మండలంలో గతంలో మొత్తం ఓటర్లు 34,097 ఉండగా మొదటి, రెండవ చేర్పుల జాబితా ద్వారా 926 ఓటర్లు చేరగా మొత్తం 35,023 ఓటర్లు మండలంలో ఉన్నారని తెలిపారు. గతంలో మండలంలో 11 ఎంపిటిసి స్థానాలు ఉండేవని, ప్రస్తుతం జగదేవ్‌పూర్ మండలం నుండి చిన్నకిష్టాపూర్, రాయవరం, ఎల్లాయగూడ, రామచంద్రాపురం, వెంకటాపూర్‌పిటి గ్రామాలు కుకునూర్‌పల్లి మండలంలో కలుస్తున్నందున చిన్నకిష్టాపూర్ ఎంపిటిసి పరిధిలోని తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాలు వట్టిపల్లి ఎంపిటిసి స్థానంలో కలుపగా జగదేవ్‌పూర్ మండలంలో 10 ఎంపిటిసి స్థానాలకు మొత్తం ఓటర్లు 31,131 ఉంటారని, ఒక ఎంపిటిసి స్థానం కుకునూర్‌పల్లి మండలానికి వెళ్ళగా జగదేవ్‌పూర్ మండలంలో 10 ఎంపిటిసి స్థానాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేసిరెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ కొండపోచమ్మ చైర్మన్ బత్తుల మల్లేశం, సిపిఎం పార్టీ నాయకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు సిద్ధం కావాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో పార్టీ నాయకులు,కార్యకర్తలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు అందరూ నిత్యం ప్రజలతోనే ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి అండగా నిలవాలన్నారు.అలాగే పార్టీ పూర్వ వైభవంలోకి రావడానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలని,సర్పంచ్ ఎన్నికల్లో టికెట్ రాని అభ్యర్థులు నిరాశకు లోనవవద్దని,వారికి ఎంపిటిసి టికెట్లు ఇప్పివ్వడంతో పాటు మిగితా వారికి పార్టీలో మంచి పదవులు అందిస్తామన్నారు.రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో బిఆర్ఎస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మహ్మదాపూర్ మాజీ ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి,బొల్లి తిరుపతితో పాటు కూచనపల్లి గ్రామానికి చెందిన గూళ్ల చంద్రమౌళితో పాటు పలువురు బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి సతీష్ కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

త్వరలో అంబర్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభం
-దూసరి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం,గత రాష్ట్ర ప్రభుత్వంలో అంబర్‌పేటలో కొత్త ఫ్లైఓవర్ రావడం సంతోషకరమని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. త్వరలో పనులన్నీ పూర్తయి త్వరలో ఫ్లైఓవర్ ప్రారంభం కాబోతుందని అన్నారు. మంగళవారం అంబర్‌పేట చేనెంబర్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభానికి ముందే సబ్ రోడ్లను పూర్తి చేయాలని కోరారు. అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సబ్ రోడ్లను అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గోల్నాక డివిజన్ ఖాద్రి బాగ్ ముస్లిమ్స్ స్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత రాష్ట్ర రోడ్ల భవనాల అధికారి ఈఈ ధర్మారెడ్డితో, జిహెచ్ ఎంసి అధికారులతో మాట్లాడినట్టు ఆయన తెలిపారు. సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరలో ముస్లిమ్స్ స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

తప్పుల తడకగా కులగణన నివేదిక
-తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ ఆరోపణ

సైఫాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన నివేదిక తప్పుల తడకగా ఉందని, బిసిలను రాజకీయంగా అణగదొక్కడానికి కుట్రలో భాగమేనని తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ ఆరోపించారు. ఈడబ్లూఎస్ రిజర్వేషన్‌లు కాపాడుకునేందుకే అగ్రవర్ణాల జనాభాని పెంచి చూపించారని, 2011 తెలంగాణ జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3 కోట్ల 70 లక్షలు ఉండగా దానిలో బిసి జనాభా ఒక కోటి 84 లక్షలు చూపించారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన నివేదికలో బిసి జనాభా తగ్గించి ఒక కోటి 64 లక్షకు చూపారని ఆయన ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల జనాభా పెరగాల్సి ందిపోయి తగ్గించి చూపడం రాజకీయ కుట్రలో భాగమేనని, 2011లో ఓసిల జనాభా 10 శాతంలోపే ఉండగా ప్రస్తుతం 15.79 శాతానికి పెరిగనట్లు చూపించారని, ఓసిల జనాభ పెరగడం, బిసి జనాభా తగ్గడం ఏమిటి ? అని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రసుత్త సర్వేను పున:సమీక్షించి నిజమైన గణాంకాలను వెల్లడించాలని, బిసిల రిజర్వేషన్‌లన 42 శాతంకు పెంచి, విద్యా, ఉద్యోగ రంగాలలో 52 శాతానికి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిసిలు తిరగబడతారని, ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తారని ఆయన హెచ్చరించారు.

సంక్షేమ పథకాలు పేదవాడికి అందేలా చూస్తాం

బోరబండ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫిసియుద్దీన్

యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూస్తామని గ్రేటర్ మాజీ ఉపమేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. మంగళవారం బోరబండ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రం (ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన అర్జీల స్వీకరణ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బోరబండ డివిజన్‌లోని పలు బస్తీలకు చెందిన లబ్ధిదారుల వారి అప్లికేషన్లను అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని అర్హులైన పేదవాడికి పథకాలు తప్పని సరిగా అందుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు ప్రజా సంక్షేమం కోసం పాటుపడే నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, ఈఈ రాజ్‌కుమార్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

బేగంపేట ఫిభ్రవరి 4,ప్రభాతవార్త

జంట నగరాలకు చెందిన మున్నూరు కాపు విధ్యార్థినీ,విధ్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు సికింద్రాబాద్ కాపు సంఘం ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు హెచ్ కిషన్ తెలియజేసారు. ఇంటర్మీడియట్ ,డిగ్రీ,పాలిటెక్నిక్ ,మెడిసిన్ ,ఇంజనీరింగ్,లా ,అగ్రికల్చర్ ,ఎంబీఏ,ఎంసీఏ,ఫార్మసీ,యానిమల్ హస్బెండరీ తదితర విద్యను అభ్యసిస్తున్న విధ్యార్థులు ఈ స్కాలర్ షిన్‌లకు అర్హులని తెలిపారు.దరఖాస్తుదారులు గడచిన పరిక్షల్లో 75శాతం కంటే అధికంగా మార్కులు సాధించి ఉండాలని,తల్లి దండ్రులను కోల్పోయిన,ఆర్థికంగా వెనుక బడిన వికాలాంగులకు ప్రాధ్యన్యత ఇస్తామన్నారు.ఈ నెల 5నుంచి దరఖాస్తులను ఎంజీ రోడ్డు చర్మాస్ పక్కన ఉండే సికింద్రాబాద్ కాపు సంఘం కార్యాలయంలో పొందవచ్చని,పూర్తి చేసిన దరఖాస్తులు 25వతేదీ లోపు అందించాలని సూచించారు.దరఖాస్తుతో పాటు కుల దృవీకరణ, బోనఫైడ్ ,ఆదాయ దృవీకరణ,మార్కుల మెమో,అడ్రస్ ప్రూఫ్‌లు అందించాలని మరిన్ని వివరాలకు ఆఫీసు ఇంచార్జి పట్టెం సుదర్శన్ రావు ను సంప్రదించాలని సూచించారు.

చిన్ననాటి నుండే పిల్లల్లో కళాతృష్ణ పెంచాలి

గురువులను సత్కరిస్తున్న రామదాసు తేజావత్, నవీన్, రామకృష్ణ, చంద్రమౌళి, హంసవేణి తదితర అతిథులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : పిల్లల తల్లిదండ్రులు చిన్ననాటి నుండే తమ పిల్లలకు కళాతృష్ణ కల్పించడమే కాకుండా వారికే కళపై ఆసక్తి ఉందో దానిని నేర్పించాల్సిన అవసరముందని పోలీసు ఉన్నతాధికారి రామదాసు తేజావత్ అన్నారు. నిర్వాహక సంస్థల తమవంతు బాధ్యతగా కళలను, కళాకారులను అద్భుత జాతీయ వేదిక రవీంద్రభారతిని అందించి ప్రోత్సహించడం హర్షదాయకమని సంస్థల కళాసేవలను కొనియాడారు. అంజలి నాట్యాలయం, హంసాంజలి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆయా సంస్థల 13వ, 2వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో కనువిందుగా క్లాసికల్, సెమీ క్లాసికల్ విభాగాల్లో నిర్వహించిన భరతనాట్యం తదితర శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలు జనరంజకంగా సభికులను రంజింపజేశాయి. ఈ వేడుకల్లో రామదాసు తేజావత్‌తోపాటు అతిథులుగా పాల్గొన్న నవీన్ యాదవ్, పాలడుగు రామకృష్ణ, చంద్రమౌళి, నాట్యగురు హంసవేణి తదితరులు పలువురు నాట్యగురువులను ఘనంగా సత్కరించి ఈనాటి నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు ఎంతగానో అభినందించి జ్ఞాపికలను అందజేశారు.

బిసిలకు విద్యా, ఉద్యోగ రంగాలలో 44 శాతంకు రిజర్వేషన్‌లు కల్పించాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: బిసిల జనాభా లెక్కలు వచ్చిన నేపథ్యంలో విద్యా, ఉద్యోగ రంగాలలో బిసిలకు 25 శాతం నుంచి 44 శాతంకు పెంచుతూ ప్రభుత్వం తక్షణమే జివో జారీ చేయాలని నేషనల్ పోలిటికల్ జస్టీస్ ఫ్రంట్ ఛైర్మన్ వి.జి.ఆర్.నారగోని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి జివో జారీ చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారగోని మాట్లాడుతూ రిజర్వేషన్‌ల పెంపుపై ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపితే ఉపయోగం లేదని, ఇవి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనివేనని, ఈ రెండు అంశాలపై అసెంబ్లీలో చర్చించి జివో జారీ చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన ఆరు మంత్రి శాఖలను బిసిలకే కేటాయించాలని కోరారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు 70 శాతంకు పైగాఉన్న బిసి, మహిళా, మైనార్టిలకు ఎమ్మెల్యే, ఎంపి టిక్కెట్లను వారి జనాభ ప్రకారం కేటాయించకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ

సమావేశంలో మాట్లాడుతున్న విజిఆర్ నారగోని

చేశారని, పార్టీల రిజిస్ట్రేషన్ నిబంధనల ప్రకారం వారికి ప్రాతినిధ్యం కల్పించాలని చెపుతున్నదని, అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించకుండా రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తాము రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఫ్రంట్ నేతలు కె.బి.శ్రీధర్, జెఎల్ ఆశ్వీరాదం, మీనగా గోపి, కుడుపుడి మహేశ్వర్‌రావు, నర్సయ్య,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలకు అడ్డగా మారిన నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్

ప్రభుత్వ భూములను కాపాడడానికి ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేయాలి : బిజెపి

నిజాంపేట్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూములను కాపాడి ప్రజల అవసరాల కోసం వినియోగించాలని బాచుపల్లి మండల డిప్యూటీ ఎమ్మార్వో ప్రభుదాస్‌కి మంగళవారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులైన బిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజుల ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్‌లో గల ప్రభుత్వ భూములు ఆక్రమించి రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు జరుపుతూ ఇళ్లను నిర్మిస్తూ ఉన్నారని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవలసిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకోకపోగా ఆ ఇండ్లకు ఇంటి నెంబర్స్, ఎలక్ట్రిసిటీ మీటర్స్ కూడా జారీ చేయించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కొత్తగా ప్రభుత్వ భూములలో ఏర్పడుతున్న కాలనీలకు రోడ్ల నిర్మాణాలు కూడా చేయడం చూస్తూ ఉంటే అక్రమ నిర్మాణాలను ఎలా ప్రోత్సహిస్తున్నారో అర్థమవుతుందని, భారతీయ జనతా పార్టీ పేదవారి ఇండ్లకు వ్యతిరేకం కాదని కానీ బడుగు బలహీన వర్గాలను అడ్డుపెట్టుకొని ఒక్కొక్క ఇంటికి వివిధ రాజకీయ పార్టీ నాయకులు 5 నుండి 20 లక్షలు వసూలు చేస్తూ ప్రభుత్వ భూములలో ఇల్లు కట్టుకోవడానికి వారి మద్దతు తెలియజేస్తున్నారని అన్నారు. వారి అండదండలతో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలనేవి పెద్ద ఎత్తున పెరుగుతూ రాత్రికి రాత్రి నిర్మాణాలను పూర్తి చేయడం జరుగుతుంది, అలాగే సర్వేనెంబర్ 186 పక్కన వెలిసి నటువంటి స్ప్రింగ్ వ్యాలీ, హిల్ కౌంటీలలో ప్రవేట్ సర్వే

డిప్యూటీ ఎమ్మార్వో ప్రభుదాస్‌కి వినతి పత్రం సమర్పిస్తున్న భాజపా శ్రేణులు

నెంబర్ను చూపిస్తూ ప్రభుత్వ భూమి అయిన 186లో అక్రమ విల్లాలు వెలిశాయన్నారు. సర్వే నెంబర్ 191 లో రాత్రికి రాత్రి ఇండ్లు వెలుస్తున్నాయని, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఇతర సర్వే నెంబర్లు ఉన్న ప్రభుత్వ భూములను నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ముందు నిజాంపేట మున్సిపల్ ఏర్పాటు చేసిన తర్వాత ఏ విధంగా ఉన్నాయో శాటిలైట్ సర్వే చేసి వాటి పైన సమగ్ర విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరారు. ప్రభుత్వ భూములను కాపాడడానికి ల్యాండ్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు విజిలెన్స్ కమిషన్ ద్వారా విచారణ జరపాలని లేనియెడల న్యాయ పోరాటం చేయడానికి బిజెపి సిద్ధంగా ఉందని, ప్రభుత్వ భూములను కాపాడి ప్రజల అవసరాలకు వినియోగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా మండల నాయకులు దాసి నాగరాజు, గజ్జల సంతోష్ కుమార్, సుమన్ రావు ,పద్మ ప్రసాద్, శేషారావు, విజయలక్ష్మీ, సుబ్బారావు, సచిన్, వెంకటేష్ ముదిరాజ్, రాజేష్, నారాయణమూర్తి, శివ, రిపన్ కాశి, శివ, ప్రసాద్, భూపాల్ రెడ్డి, ఉదయ్ కిరణ్, సురేష్, చరణ్, అవినాష్, జనార్ధన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు కలగకుండ అన్ని ఏర్పాట్లు
-సౌత్ జోన్ ఎస్ఈ సోమిరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్,సౌత్ జోన్ ఎస్ఈ సోమిరెడ్డి,విద్యుత్ శాఖ అధికారులు

చార్మినార్,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతనగరంలో వేసవి కాలం సందర్భంగా వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్నిఏర్పాట్లు చేశామని సౌత్ జోన్ ఎస్ఈ సోమిరెడ్డి అన్నారు.వేసవి కాలంతో పాటు వచ్చే నెలలో రంజాన్ మాసం ప్రారంభం కానున్న సందర్భంగా పాతబస్తీ మీరాలం విద్యుత్ సబ్ స్టేషన్‌ను సోమవారం బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్,సౌత్ జోన్ ఎస్ఈ సోమిరెడ్డి, చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్‌తో కలిసిపరిశీలించారు.రంజాన్ మాసంతో పాటు వేసవి కాలంలో ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండ తగు చర్యలు తీసుకోవాలని బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్ఈ సోమిరెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు.కాగా విద్యుత్ సరఫరాలో సమస్యలు కలగకుండ హైదర్‌గూడ,మీరాలం,అత్తాపూర్‌తో పాటు పలు ఫీడర్లను రెండు భాగాలుగా విభజించి అదనంగా లైన్లు వేస్తున్నారు.పలు చోట్ల ఇంటర్ లింక్ కూడ చేస్తున్నారు. ఫీడర్ల విభజన పనులు చురుకుగా జరుగుతన్నాయి.ఈ కార్యక్రమంలో చార్మినార్ డిఇ ఎం.శ్రీ ధర్,చార్మినార్ సిబిడి ఎడిఈ మహ్మద్ అక్బర్‌తో పాటు పలువురు విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన బడ్జెట్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన బడ్జెట్ అని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కాటేదాన్‌లోని బిజెపి కార్యాలయం ఆవరణలో మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చిత్ర పటానికి రాజేంద్ర నగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడితో పాటు బిజెపి నాయకులు,.కార్యకర్తలు కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ (2025-26) మధ్య తరగతి ప్రజలు, రైతు సంక్షేమానికి అభివృద్ధికి బాటలు వేస్తుండటంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేసే బడ్జెట్ అని తెలిపారు.చిన్న పరిశ్రమలకు అప్పున్న హస్తాన్ని అందించిన బడ్జెట్ అని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్దన్, బిజెపి నాయకులు జోగి,రవి,రావుల భాస్కర్, పి.మల్లేష్ యాదవ్, ఎన్.జగన్,నంతుగౌడ్,టి.చిన్న,మురళీధర్ రెడ్డి,వెకంట రమణ,వి.లక్ష్మీ,అంజమ్మ,ఎ.శంకర్ రెడ్డి,వి.శ్రీనివాస్,గోపాల్ నాయక్,ప్రభాకర్,సురేష్,శంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వే అంతా బూటకమే
-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

ముషీరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర కులగణన సర్వే అంతా బూటకమేనని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి. సాయిబాబా ఆరోపించారు. మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కేసీఆర్ నిర్వహించిన సర్వేలో 52శాతం ఉన్న బీసీలను రేవంత్‌రెడ్డి చేయించిన సమగ్ర కులగణన సర్వేలో 42శాతం ఉన్నట్లు చూపించటం చూస్తూ ఉంటే ఈ సర్వే ఎంత తప్పుల తడకగా నిర్వహించారో అర్థమవుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, ఇటువంటి వైఖరి మార్చుకోకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. అగ్రవర్ణాల చేతిలో అధికారం ఉంచుకోవడానికి ఆడుతున్న నాటకం ఈ సమగ్ర సర్వే అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో తాను కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలుచేయలేక, ఈ బూటకపు సర్వే పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లె ల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, బి.రాజు పాల్గొన్నారు.

ప్రజాపక్తా పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

గోషామహల్,ఫిబ్రవరి 4ప్రభాతవార్త: ప్రజా ఎక్తా పార్టీ బలోపేతం తమ శక్తి వంచనలేకుండా కృషి చేస్తామని నూతనంగా సాంస్కృతిక శాఖ విభాగం,మహిళా విభాగం అధ్యక్షులుగా నియమితులైన ప్రశాంత్ యర్రంశెట్టి, అంకిరాయ్‌లను పేర్కొన్నారు.ఈమేరకు వారికి గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఆపార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త చేతులమీదుగా నియామక పత్రాలను అందుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తమ నమ్మకం ఉంచి ప్రజా ఏక్తాపార్టీ విభాగాల్లో నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

టిఎన్‌జిఓ అధ్యక్ష,కార్యదర్శులకు సన్మానం

గన్‌ఫౌండ్రి,ఫిబ్రవరి 4ప్రభాతవార్త:

హైదరాబాద్ జిల్లా తెలంగాణ నాన్‌గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగావిక్రమ్‌కుమార్,ప్రధాన కార్యదర్శిగా కుర్రాడి శ్రీనివాస్‌లను నూతనంగా నియమితులయ్యారు. వారిని కేంద్ర సంఘంఅధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ సమక్షంలో నియమించారు.ఈసందర్భంగా హైదరాబాద్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శిలను టిఎన్‌జిఓ ఇఎన్‌టి ఆసుపత్రి విభాగం అధ్యక్షులు తూమ్ముకుంటరాజు,సభ్యులు స్రవంతి నిహారికలు శాలువ కప్పి సన్మానించారు.కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్ రాజ్‌కుమార్,మాజీ కార్యదర్శి ప్రభాకర్ టిఎన్‌జిఓ ఉద్యోగులు పాల్గొన్నారు.

విఆర్ ఆస్పత్రిలో కంటోన్మెంట్ సిఈఒ తనిఖీలు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్తః

ఎట్టకేలకు బోర్డు అధికారులు అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆసుపత్రులపై చర్యలకు ఉపక్రమించారు. బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ లేఖతో ఏకంగా సీఈఓ ఆధ్వర్యంలో తనిఖీలకు శ్రీకారం చుట్టారు. బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ ఫణికుమార్‌తో కలిసి మంగళవారం బోయిన్‌పల్లిలోని వీఆర్ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రికి సంబంధించిన అనుమతి పత్రాలు, భవన నిర్మాణ అనుమతులు, ట్రేడ్ లైసెన్సు సహా ట్యాక్స్ వివరాలు సమర్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం నాటికి సంబంధిత పత్రాలను బోర్డు కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరి, అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు. తాజాగా బోర్డు అధికారులు సైతం ఆసుపత్రిపై దాడులు నిర్వహించారు. వీఆర్ ఆసుపత్రికి సంబంధించి తగిన అనుమతి లేవని తేలితే చర్యలు తీసుకుంటామని సీఈఓ మధుకర్ నాయక్ వెల్లడించారు. వీఆర్ ఆసుపత్రి అక్రమాలపై బోర్డు అధికారుల దాడులతో కంటోన్మెంట్ వ్యాప్తంగా అనుమతుల్లేకుండా కొనసాగుతున్న పలు ఆసుపత్రులు నిర్వాహకుల్లో వణుకు మొదలైంది. ఈ పాటికే బోర్డు అధికారులు చేపట్టిన అంతర్గత తనిఖీల్లో పదుల సంఖ్యలో అక్రమ ఆసుపత్రులు ఉన్నట్లు సమాచారం. త్వరలో ఆయా ఆసుపత్రులపై కూడా చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్లానర్ ఫణికుమార్,ఏఈ జిష్ణులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటాన్ని సహించం
: రామకృష్ణ, బోర్డు సభ్యుడు

ప్రజారోగ్యానికి భరోసా కల్పించాల్సిన ఆసుపత్రులే ప్రమాదకరంగా మారితే ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించం. వీఆర్ ఆసుపత్రిలో ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో, కమిటీ వేయాల్సిందిగా బోర్డు సీఈఓకు లేఖ రాశా. తదనుగుణంగానే చర్యలు మొదలయ్యాయి. వీఆర్ ఆసుపత్రితో పాటు కంటోన్మెంట్ వ్యాప్తంగా ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహిస్తాం. లోపభూయిష్టంగా ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఇస్తాం. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవు.

బిసి కులగణన సర్వే రిపోర్టు బూటకం : అయిలి వెంకన్నగౌడ్

హైదరాబాద్,ఫిబ్రవరి 4ప్రభాతవార్తః

రాష్ట్రంలో నిర్వహించిన బీసీ కులగణన సర్వే రిపోర్టు పూర్తిగా బూటకపు సర్వేగా అభివర్ణిస్తున్నామని తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్న గౌడ్ అన్నారు.మంగళవారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకన్నగౌడ్ మాట్లాడుతూ ఈ సర్వేలో గత 2014 సమగ్ర కుటుంబ సర్వే లో 51 శాతంగా ఉన్న బీసీల సంఖ్యను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలు 46 శాతానికి కుదిరించటం పట్ల దుర్మార్గమైన చర్య దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అగ్రకులాల సంఖ్యను రెట్టింపు చేసి బీసీ,ఎస్సీ,ఎస్టీల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపడం హేయమైన చర్యగా అభివర్ణిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో సమగ్రంగా చేయని సర్వే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సర్వే చేస్తా అంటే నమ్మడం ఎలా అని ప్రశ్నించారు.మొత్తం బీసీల సంఖ్య గత పది సంవత్సరాల నుండి పెరగాలి కాని తగ్గుతుందా,ఈ సంఖ్యని తగ్గించి రిజర్వేషన్లు కుదించి అగ్రకులాల సంఖ్యను ఎక్కువ చూయించి రిజర్వేషన్లు బీసీలకు రాకుండా చేసే కుట్ర దాగుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రస్తుతం నడుస్తున్నది ప్రజా పాలన కాదని రెడ్డిపాలనని అగ్రకుల పాలనని మొత్తం రెడ్లతో అసెంబ్లీ మండల నిండిపోయిందని బేసిలకి స్థానం లేదని విమర్శించడం జరిగింది.

అల్కాపూర్ టౌన్‌షిప్‌లో నిఘాను పెంచాలని ఇన్‌స్పెక్టర్‌కు వినతి

నార్సింగి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో పోలీసు నిఘాను మరింత పెంచాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ నేతృత్వంలో మంగళవారం నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ తరుచూ ఈ ప్రాంతంలో స్నాచింగ్‌లు జరుగుతున్నాయని, గంజాయి ఆకతాయిల వికృత చేష్టలు పెరిగిపోయాయని, వీటిని అదుపు చేసేందుకు పోల

బహుమతులు అందుకున్న విద్యార్థులు

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి ఎంపికైన ధూళిమిట్ట విద్యార్థులు

ధూళిమిట్ట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : ఫోరమ్ ఫర్ ఫిజికల్ సైన్స్ టెస్టులో జిల్లా స్థాయికి ధూళిమిట్ట విద్యార్థులు ఎంపికయ్యారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ప్రథమ రుషివర్ధన్ ధూళిమిట్ట, ద్వితీయ డి.సాగర్ బైరాన్‌పల్లి, తృతీయ ఇ.ప్రణయ్ ధూళిమిట్ట బహుమతులు అందుకున్నారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు కర్ణాకర్‌రెడ్డి విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రధానం చేశారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి,కో-కన్వీనర్ రాములు, కె.నాగరాజు, రవీందర్, సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ

పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : ప్రజల ఆలోచన విధానం, ఆకాంక్షనే కెసిఆర్ అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటీ రాధాకృష్ణ శర్మ అన్నారు. మండల పరిధిలోని అనంతసాగర్, చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామాలలో మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పార్టీ జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులు నిర్మించి రైతులకు సాగు, తాగు నీరు అందించడంతోపాటు రైతుబంధు, రైతులకు రైతు బీమా అందించడం జరిగిందన్నారు.సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేతగానీ హామీలు ఇచ్చి అధికారంలోక రాగానే అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాముని శ్రీనివాస్, పాల సాయిరాం,సదానందంగౌడ్, కొండం రవీందర్‌రెడ్డి, వెంకటేశం. జంగిటి శ్రీనివాస్, బాపురెడ్డి, కాముని ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

నంగునూర్‌లో....

నంగునూర్ మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగంగౌడ్, గుండు భూపేష్, జాప శ్రీకాంత్‌రెడ్డి, కోల రమేష్, వంగ తిరుమల్‌రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి

ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న మానవహక్కుల సంఘం నేతలు

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: అక్కన్నపేట మండలం లోని గోవర్ధనగిరి గ్రామంలో ఉపాధి హామీ కూలీకి వెళ్లి మృతి చెందిన ఇద్దరు మహిళల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు అందించాలని కోరుతూ మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెండోట భూశంకరాబారి సంఘం ప్రతినిధులతో కలసి ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులతోపాటు కాళ్లు విరిగిన మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్(ఢిల్లీ) చైర్మన్‌కు లేఖ పంపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఆకోజు అరుణ్, నియోజకవర్గ అధ్యక్షులు నవీన్, నాయకులు వెంకటరమణ, నాగార్జున, శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్ నోటిఫికేషన్‌ను రద్దు చేయండి

ఆర్డీవో కార్యాలయంలో చౌటపల్లి వాసుల వినతి

ఆర్డీవోతో మాట్లాడుతున్న చౌటపల్లి గ్రామస్థులు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని చౌటపల్లి, జనగామ, తోటపల్లి గ్రామాలలో గతంలో పేద, దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను ప్రస్తుత ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ భూములు కోల్పోతున్న నిర్వాసితులు మంగళవారం హుస్నాబాద్ ఆర్డీవోను కలసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కు విషయంలో భూములు ఇవ్వమని స్పష్టంగా చెబుతున్నా కొంతమంది కాస్తుకు లేనివారితో గ్రామాలకు చెందిన కొందరు రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత లాభాల కోసం అధికారులకు తప్పుడు రిపోర్టు ఇవ్వగా ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. మా తాతల కాలం నుండి మీము అనుభవిస్తున్న భూములు లాక్కోవద్దని డిమాండ్ చేశారు.ఈ విషయంలో తమకు తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాదాసు శ్రీనివాస్

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఉబ్బని స్వామి(40) అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో వారికి ధైర్యం చెప్పారు. పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని, స్వామి పార్టీకి చేసిన సేవలను గుర్తు చేశారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, ప్రభాకర్, తూం నర్సింలు తదితరులు ఉన్నారు.

గీతంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో మంగళవారం ప్రముఖ పురాణ స్వరకర్త త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు.గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని కళలు, ప్రదర్శనా కళల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సంగీతం,నృత్యం ద్వారా త్యాగరాజ వైభవం – త్యాగరాజ కృతులు, అనుభూతి, శైలి, ఔన్నత్యాలను మరోసారి మననం చేసుకుని, ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ వేడుకలో గాయకులు డాక్టర్ నిర్మల్ హరీష్, మృదు రవళి దర్భల త్యాగరాజ కీర్తనలతో సహా ఆకర్షణీయమైన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. డాక్టర్ వై. లలిత సింధూరి, పీబీ వైష్ణవిలు కూచిపూడి, అంజు అరవింద్ భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో త్యాగరాజుకు నివాళులర్పించారు. కాగా, చంద్రకాంత్ మృదంగంపై, మహావాది వాసు విశ్వనాథ్‌శాస్త్రి వయోలిన్‌తో వారికి సహకారం అందించారు. తొలుత, ఈ కార్యక్రమం గాంధీ కూడలి నుంచి ఉత్సాహభరితమైన పల్లకీ సేవ(ఊరేగింపు)తో ప్రారంభమై, నామ సంకీర్తన స్ఫూర్తిని చాటి చెప్పింది. భక్తులు సంగీతం ద్వారా తమ భక్తిని వ్యక్తపరిచే సంప్రదాయం, వారికళకు గుర్తింపుగా వివిధ రూపాలలో సహకారం, మద్దతు పొందుతారు. ఈ ఆచారం త్యాగరాజ వారసత్వంలో లోతుగా పాతుకుపోయిన ఆయన దివ్య నామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయాలతో గౌరవించబడ్డాయి. త్యాగరాజ వైభవం సంగీతం, నృత్యం,సంప్రదాయాన్ని అందంగా మిళితంచేసి, భారతదేశపు గొప్ప సంగీత సాధువులలో ఒకరికి గీతం ఆత్మీయ నివాళి అర్పించింది.

గీతంలో త్యాగరాజ ఆరాధన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సైబర్ బెదిరింపులకు నో చెప్పండి....వీధి నాటక ప్రదర్శన

సైబర్ బెదింపులను ఎదుర్కోవడానికి, సైబర్ నేరాల గురించి సమాజానికి అవగాహన కల్పించడానికి ఒక సృజనాత్మక ప్రయత్నం, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని అప్లైడ్ సైకాలజీ విభాగం చేసింది. సే నో టు సైబర్ బుల్లియింగ్ పేరిట వీధి నాటకాన్ని జేబ్లాక్ ముందు, ప్రధాన ద్వారం ఎదుటి రోడ్డు మీద ప్రదర్శించారు. ఆన్ లైన్ భద్రత గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న పలువురు విద్యార్థులను ఇది ఆకర్షించింది. సైబర్ నేరాన్ని గుర్తించడానికి, నిరోధించడానికి ఆచరణాత్మక దశలను ఈ నాటకం ప్రదర్శించి, అప్రమత్తత, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తన ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. ఏదైనా సైబర్ బెదిరింపు సంఘటలు జరిగితే, వాటిని ప్రత్యేక హాట్ లైన్ 1930కు ఫిర్యాదు చేయడంద్వారా రక్షణ లేదా ఉపశమనం పొందవచ్చని ఆ నాటకం ద్వారా ఇచ్చిన సందేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన విద్యార్థి ప్రతినిధి అఫ్రీన్ మాట్లాడుతూ, డిజిటల్‌యుగంలో తమను తాము రక్షించుకోవడానికి విద్యార్థులకు జ్ఞానం, సాధనాలతో సాదికారత కల్పించడమే మా లక్ష్యం. సురక్షితమైన ఆన్ లైన్ సంఘాన్ని సృష్టించడానికి ఈ వీధి నాటకం మా చొరవలలో ఒకటి అని పేర్కొన్నారు.

గ్రామాల్లో 90 శాతం అభివృద్ధి కేంద్రం ప్రభుత్వం చేసిందే

-బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధమల్లేష్‌గౌడ్

కొల్చారం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: గ్రామాలలో జరిగిన అభివృద్ధి పనుల్లో 90 శాతం కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుకుటుందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధమల్లేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని ఆయన స్వగృహంలో వాల్దాస్ రాధ మల్లేష్ గౌడ్‌ను కొల్చారం మండల జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాధ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ గతంలో పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మహమ్మద్ అఫ్సర్, పట్లోరి వెంకటేశం, వనమాల అనిల్, వడ్ల సంతోష్ తదితరులు ఉన్నారు.

పేద ప్రజలకు చేయూతనిచ్చే విధంగా కేంద్ర బడ్జెట్

మేడ్చల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు చేయూతనిచ్చే విధంగా ఉందని మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజ హరినాథ్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని వివేకానందవిగ్రహం వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ, మేడ్చల్ మండలాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని బిజెపి పాలనను ప్రదానమంత్రి నరేంద్రమోడీ కొనసాగిస్తు న్నారని, అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్‌ను ప్రజలకు ఉపయోగకరంగా ప్రవేశపట్టారని తెలిపారు. కేంద్రంలోని బిజెపిప్రభుత్వ హయాం లోనే దేశం ఆర్థికపురోగతి సాధించిందని అన్నారు. అంతేకాకుండా పారిశ్రామిక అభివృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని, వ్యవసాయ రంగంలో కూడా అభివృద్ధిచెందిందని అన్నారు. అన్ని రంగాలుగా అభివృద్ధి దిశలో పయనిస్తున్న భారతదేశంవైపు నేడు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌తో సగటుజీవులు, ఉద్యోగస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, అందరికీ ఆమోదయోగ్యంగా బడ్జెట్ ఉందన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జగన్ గౌడ్, ప్రేమ్‌దాస్, శ్రీకాంత్, అర్జున్, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, సర్వేశ్వర్‌రెడ్డి, రాజు, వంశీ, పుష్పారెడ్డి, హేమలతారెడ్డి, అనిత, మహేష్, దశరథ, నర్సింగ్, పురుషోత్తం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అవగాహనతోనే సమస్యల పరిష్కారం

వికారాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: భూ సమస్యలతో పాటు ఇతర సమస్యల పై అవగాహనా కలిపించుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు జిల్లాలో నూతనంగా విదులలో చేరిన 34 మంది జూనియర్ అసిస్టెంట్ లకు అవగాహనా కార్యక్రమము ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జూనియర్ అసిస్టెంట్ల ను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో రెవెన్యూలో పని చేయటమంటే చాల బాధ్యతతో పని చేయాల్సిన అవసరముందని అన్నారు. రెవెన్యూ ఒక్కటే కాదు, ఇతర శాఖలపై అవగాహనా కలిగి ఉండాలని సూచించారు. తెలంగాణా చట్టాలపై పూర్తి అవగాహనా కలిగి ఉండాలని తెలిపారు. భూ సమస్యలు ఉంటేనే ప్రజలు వస్తారని, వారు ఎందుకు వచ్చారు, ఏమి సమస్య ఉంది, అన్ని వివరాలు పూర్తి స్తాయిలో తెలుసుకొని ముందుకు వెళ్ళాల్సి ఉంటుందని అన్నారు. సీసీఎల్ఏ రూల్స్ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలలో అవగాహనా కలిగి ఉండాలని, ప్రజల సమస్యలను సానుకులతతో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ (రిటైర్డ్)సురేష్ పొద్దార్ రెవె న్యూ రికార్డ్స్, ఫైల్ సిస్టం, ఇనాం, ప్రభుత్వ భూమి, క్లెయిమ్స్, అభ్యంతరాలు, భూ రికార్డులు, తెలంగాణా వివిధ చట్టాల అమలు తీరుపై అవగాహనా కలిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఏఓ ఫర్హీన, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్ డివిజన్ బిసి మహిళ అధ్యక్షురాలిగా అనిత

తాండూరు టౌన్ ఫిబ్రవరి 4,ప్రభాతవార్త : బిసి మహిళల అభ్యున్నతికి మహిళా ప్రతినిధులు కృషి చేయాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ రాజ్కుమార్ కందుకూరి అన్నారు. తాండూర్ అసెంబ్లీ డివిజన్ మహిళా అధ్యక్షురాలుగా రాజకాలనీకి చెందిన అనితకు నియామక పత్రం అందజేసిన రాజ్ కుమార్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్ చారి రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకూర్ ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా బీసీ సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు గా అనిత,బిసి మహిళా సంఘం చేస్తున్న అనేక కార్యక్రమంలో అనిత చురుకుగా పాల్గొనవారని అందుకు గుర్తింపుగా జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశం మేరకు అనితను తాండూర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలుగా నియమించడం జరిగిందని ప్రతి గ్రామంలో నూతన బిసి మహిళా సంఘాలు ఏర్పాటుకు అనిత కృషి చేయాలని అన్నారు అనిత మాట్లాడుతూ నాపై విశ్వాసంతో జాతీయ బీసీ నాయకత్వం జిల్లా బీసీ నాయకులు అధ్యక్షులుగా నియమించినందుకు నాతో పాటు మహిళలు నన్ను ప్రోత్సహిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు త్వరలోనే బీసీ మహిళా సభ ఏర్పాటు చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకుర్ మహిళా అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్ చారి బిసి మహిళా సంఘం ప్రతినిధులు లక్ష్మీనరసమ్మ మంజుల విజయలక్ష్మి బషీరాబాద్ మండల అధ్యక్షురాలు వీరమని సోషల్ మీడియా ఇన్చార్జ్ బసవరాజ్ బీసీ యువ నాయకుడు టైలర్ రమేష్ వివేక్ తదితరులు ఉన్నారు.

రెండు వేర్వేరు ప్రమాదంలో ఇద్దరు మృతి మరో ఇద్దరికి గాయాలు

మేడ్చల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటకు చెందిన భవన కార్మికులు నగరంలోని బోయిన్‌పల్లిలో నివాసముంటున్న ఉషప్ప(40), శ్రీకాంత్, శ్రీనివాస్‌లు పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పనినిమిత్తం మంగళ వారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళుతూ మేడ్చల్ పారిశ్రామికవాడ వద్ద 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఉషప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పైఉన్న మరో ఇద్దరు శ్రీకాంత్, శ్రీనివాస్‌లకు గాయాలయ్యాయి. అదేవిధంగా మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట గ్రామశివారులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద 44వ జాతీయ రహదారిపై వరంగల్‌కుచెందిన చుక్క శ్రీచరణ్ (29) తన బుల్లెట్ బైక్‌పై వస్తూ ముందుగా వెళుతున్న కంటైనర్ లారీని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో అతను లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాలకు చేరుకుని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చీరికి తరలించారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిబ్రవరి 7న ర్యాలీకీ అనుమతి కోరుతూ డిఎస్‌పికి వినతి

పరిగి ఫిబ్రవరి 4 ,ప్రభాతవార్త : మంద కృష్ణమాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యం లో నిర్వహించే లక్ష డప్పులు...వెయ్యి గొంతులఖి సభకు ర్యాలీగా వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ పరిగి డిఎస్పి శ్రీనివాస్ కు పరిగి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందించారు.. ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరిగే ఏబిసిడి వర్గీకరణ సభ కోసం వికారాబాద్ జిల్లా, పరిగిలో కొడంగల్ చౌరస్తా నుండి ఏబీఎస్ ప్లాజా వరకు డప్పులతో ర్యాలీగా వెళ్లేందుకు పరిగి డిఎస్‌పిని అనుమతి కోరారు... ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలూకా నాయకులు సురేందర్, దేవునిగూడెం వెంకటన్న,సురేష్, వినోద్, గోపాల్,లాజర్, డాక్టర్ రమేష్ పూడూర్, మాణిక్యం, గోపాల్,అశోక్,విజయ్, చౌడాపూర్ మండల వెంకట్ రాములు, మొగులయ్య, చిన్న వెంకట్ రాములు,కుల్కచర్ల రమేష్, దోమ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందించారు.

కనుల పండువగా తిరుమలాయ స్వామి కళ్యాణం

తిలకించిన వేలాది మంది భక్తులు...స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

రామాయంపేట (నిజంపేట), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : ఈ ప్రాంతంలో పేరుగంచిన తిరుమలాయ స్వామి జాతర ఘనంగా జరుగుతుంది. ఈనెల మూడవ తేదీ సోమవారం నుండి ప్రారంభమైన జాతర ఆరవ తేదీ వరకు జరగనుంది. ఇందులో భాగంగానే తిరుమల స్వామి కళ్యాణం మంగళవారం రోజున అంగరంగవైభవంగా సాగింది. వేలాది మంది భక్తజనం స్వామివారి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ ప్రాంతంలో పేరుగాంచిన తిరమల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు నిజాంపేట మండల చల్మెడ గ్రామంలో గల తిరుమల బండపై బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవరోజు సందర్భంగా యజ్ఞం కాల్చడం, ఎండ్లబండ్లు తిరుగుట, పల్లకి సేవ, రథం తిరుగుట కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చారిత్రాత్మక చరిత్ర కలిగిన దేవాలయానికి రావడం చాలా సంతోషంగా ఉందని, స్వామి వారి దీవెనలు మెదక్ నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల ఎక్కువగా మాట్లాడలేకపోతున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ అయ్యాక మళ్లీ ఇక్కడికి వచ్చి అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాతరావు, ఆలయ ఈవో కె. రవికుమార్ శర్మ, చైర్మెన్ రాంరెడ్డి, ఆలయ ప్రధానఅర్చకులు సి.హెచ్. వెంకటరామ్మోహన్ శర్మ, టిపిసిసి అధికార ప్రతినిధి పల్లె రాంచంద్రగౌడ్, నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు రావిపల్లి అమరసేనారెడ్డి, పంజా మహేందర్, సజీరుద్దీన్, వెంకట్‌గౌడ్, లింగంగౌడ్, మరూతి, సిద్దరాములుతో పాటు పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతరలో భక్తజనం

ఎమ్మెల్యే రోహిత్‌రావుకు సన్మానిస్తున్న దృశ్యం

తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డిని సన్మానిస్తున్న బిజెపి నాయకులు

నూతన తహసీల్దార్‌కు సన్మానం

మర్కుక్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): మర్కుక్ మండల తహసీల్దార్‌గా నూతనంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌రెడ్డిని మంగళవారం బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రమేష్, తాజా మాజీ ఎంపిటిసి చైతన్య శంకర్‌రెడ్డి, బిజెపి నాయకులు కిషోర్‌రెడ్డిలు సన్మానించి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ మండలంలో రైతుల పక్షాన ఎలాంటి భూ సమస్యలు ఉన్నా రెవెన్యూ అధికారులకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

విద్యార్థుల దాహార్తిని తీర్చిన ఉపాధ్యాయుడు

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ఉపాధ్యాయుడు బోర్ వేయించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేశారు. గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటికి విద్యార్థులు ఇబ్బంది పడడంతో పాఠశాల పిఈటి ఉపాధ్యాయుడు పాలమాకుల ప్రవీణ్ గుర్తించి సొంత ఖర్చులతో బోర్ వేయించడంతోపాటు మోటార్ బిగించి వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సమస్యకు స్పందించి సొంత నిధులతో సమస్యను పరిష్కరించినందుకు ఉపాధ్యాయుడు ప్రవీణ్‌ను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఈనెల 5వ తేదీ బుధవారం బోర్ మోటారును ప్రారంభించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ శుభ్రం చేయడం, 16వ వార్డులోని లక్ష్మీప్రసన్న నగర్ కాలనీలో యుజిడి సమస్యను పరిశీలించడంతో పాటు సమస్యను పరిష్కరించారు. అలాగే ఇంటి పన్ను కలెక్షన్‌తోపాటు సంగుపల్లిలో నూతన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కమిషనర్ నర్సయ్య మాట్లాడుతూ మున్సిపల్‌లోని ప్రజలు చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా స్వచ్ఛ వాహనాలకు ఇవ్వాలని సూచించారు. నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

మర్కుక్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన పిట్ల యాదగిరి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.37,500 చెక్కును మంగళవారం మాజీ ఎంపిపి పాండుగౌడ్ లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ నియామకం

ఎమ్మార్పీఎస్ నూ

వనదుర్గామాతను దర్శించుకుంటున్న రీటాలాల్‌చంద్ కుటుంబ సభ్యులు

వనదుర్గామాతను దర్శించుకున్న న్యాయమూర్తి

పాపన్నపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: ఏడుపాయల వనదుర్గా భవాపి మాతపే మంగళవానం ఇబ్రహింపట్నం 7వ మెట్రోపాలిటిన్ న్యాయమూర్తి రీటాలాల్ చంద్ కుటుంబ సభ్యులసి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తి కుటుంబ సభ్యులను అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు పార్థివశర్మ వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహ్చించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తన పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పంచముఖి ఆంజనేయస్వామి 10వ వార్షికోత్సవం



పంచముఖి ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త: భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో కొలువున్న పంచముఖి ఆంజనేయస్వామి 10వ వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. దశాబ్ది వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి హాజరై అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్య క్రమంలో కాలనీ కమిటీ సభ్యులు నందగోపాల్, మధుసూదన్‌రెడ్డి, రాజి రెడ్డి, శ్రీలత, రజిత, ఊత్ నాయకులు సుధాకర్, వెంకట్‌రెడ్డి, విజయ్, రాకేష్ పాల్గొన్నారు.

జలమండలి ఎండిని కలిసిన కార్పొరేటర్ పుష్ప

జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న పుష్పనగేష్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: ఖైరతాబాద్‌లోని జల మండలి కార్యాలయంలో మంగళవారం రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనేగేష్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న డ్రైనేజి సమస్యలను ఎండి అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకుపి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందచేశారు. డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎండి అశోక్‌రెడ్డి హామి చేసినట్లు కార్పొరేటర్ పుష్పనగేష్ వివరించారు.

ఓటర్ల జాబితాపై ఎంపిడివో సమీక్ష

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఎంపిడిఓ రామలింగం

చౌటకూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాపై ఆయా రాజకీయ పార్టీ నాయకులతో మంగళవారం చౌటకూరు లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రామలింగం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. గత నవంబరు నెలలో గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితా మొదటి అనుబంధాన్ని పంచాయతీ కార్యాలయాల్లో పబ్లిష్ చేశామని ఎంపిడి వివరించారు. ఓటర్ల జాబితాపై మార్పులు, చేర్పుల అనంతరం రెండవ అనుబంధంతో పంచాయతీ కార్యాలయాల్లో తాజాగా మరో జాబితాను ఉంచామన్నారు. రెండవ మారు ప్రకటించిన ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా అందచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిఓ శ్రీకాంత్, పంచాయితీ కార్యదర్శి సందీప్‌గైడ్, కాంగ్రెస్ నాయకులు సాన గోవర్ధన్‌రాజ్, ఆగమయ్య, బిఆర్ఎస్ నాయకులు జైన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నోడల్ అధికారి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

మనూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని మనూర్‌లోని 197, 392 పోలింగ్ కేంద్రాలను నోడల్ అధికారి సమేశ్వర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటస్వామికి నోడల్ అధికారి పలు సూచనలు చేసి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అలాదుర్గంలో మాజీ సర్పంచ్‌ల అరెస్టు

అల్లాదుర్గం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: చలో సెక్రటేరియేట్ పిలుపు మేరకు తాజా మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసుతాణాలకు తరలించారు. తమ డిమాండ్‌ల సాధన కోసం సర్పంచ్‌ల సంఘం జేఏసి మంగళవారం చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చింది. మాజీ సర్పంచ్‌లు చలో సెక్రటేరియట్‌కు వెళ్లకుండా సోమవారం రాత్రి నుంచి ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకుపి పోలసుతాణాకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. చేసిన పనులకు సంబంధించి బిల్లులు వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు బేయ్య, సోనీ శివరాంతు డిమాండ్ చేశారు.

కార్మిక కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: పట్టణంలోని సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు విధులకు సరిగ్గా హాజరు కావ డంలేదని కార్యాలయం ఎదుట సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. మంగళవారం కార్యాలయం ముందు సీపీఐ నాయకులు ఆనంద్, చిరంజీవిలు మాట్లాడుతూ ఖేడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయ సహాయ కార్మిక అధికారి గిరిరాజు, జూనియర్ అసిస్టెంట్ సాయి విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. వారానికి ఒకసారి రెండుసార్లు వంతుల వారీగావస్తూ చుట్టుపుచూపుగా విధులకు హాజరవుతూ వేతనాలు పూర్తిగా పొందుతున్నారు. కార్యాలయం చుట్టూ ప్రజలు ఆయా పనుల నిమిత్తం తిరుగుతున్నా అధికారుల జాడ మాత్రం కనిపించడంలేదని తెలిపారు. కొత్త లేబర్ కార్డు కోసం వచ్చిన వారిని నీవు కూలి పనిచేసే వాడిలాలేవని, మహిళలకు లేబర్‌కార్డు ఎందుకని ఇలా అనేక కారణాలతో వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. కొంతమంది వారి కుటుంబసభ్యులు మరణించడంతో ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బుల కోసం ఏడాది, ఆరు నెలలుగా తిరుగు తున్నా

ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

అధికారులు మాత్రం కనికరిచడం లేదని తెలి పారు. ఇప్పటివరకు నాలుగు వందల లేబర్‌కార్డులు పెండింగ్‌లో ఉన్న అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. నారాయణఖేడ్ సహాయ అధికారి ఎప్పుడు హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి పెండింగ్ పనుల నిమిత్తం వెళ్లానని చెబుతున్న నాలుగు వందల కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నించారు. అధికారులు మాత్రం నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరించిన ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడంలేదని వారన్నారు. ఇప్పటికైనా అధికారులు తమధోరణి మార్చుకుని విధులకు సక్రమంగా హాజరుకావాలని వారన్నారు. లేనిఎడల డీసీఎల్, కలెక్టరు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, పుప్పల అశోక్, విజయ్, పాపయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమాదేవి

ఓటర్ లిస్ట్ అభ్యంతరాలపై ఎంపిడివో సమీక్ష

గుమ్మడిదల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో నూతన ఓటర్ జాబితాను గ్రామాల వారీగా చేర్పులు, మార్పుల ప్రకారంగా ఓటర్‌ల నమోదును వివరించారు. వివిధ పార్టీ నాయకులు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా వ్యక్తం చేయాలని కోరారు. ప్రస్తుతం ఓటర్ లిస్ట్ ప్రకారం నమోదైన ఓటర్ జాబితా కానుకుంట 2934 మంది, అనంతారం 894 మంది, మంబాపూర్ 751మంది, నల్లవల్లి, ప్యారా నగర్ 1692 మంది, కొత్తపల్లి, లక్ష్మాపూర్ 1126 మంది, నాగిరెడ్డి గూడెం 400 మంది, వీరారెడ్డిపల్లి 908 మంది, రాంరెడ్డి బావి 412 మంది, గుమ్మడిదల మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలకు మొత్తంగా 9117 మంది ఓటర్లు నమోదు అయ్యారని తెలిపారు. గ్రామాలలోని ఓటర్ జాబితాను నాయకులకు వివరించారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా త్వరలో తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, టీపీసీసీ మెంబర్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కావలి ఐలేష్, కొత్తపల్లి తాజా మాజీ ఉప సర్పంచ్ విజయ్ కుమార్, పడమటి మహిపాల్ రెడ్డి, బీజేపీ తాజా మాజీ అధ్యక్షుడు పలుగు గోవర్ధన్ రెడ్డి, ఎంపీవో దయాకర్, సీనియర్ అసిస్టెంట్ సుభాష్, రాములు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందూర్‌లో క్రికెట్ టోర్నమెంట్



నగదు, మెమోంటోను అందుకుంటున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : ఇందూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యం లో ఇందూరు ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) ఇంటర్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచులు మంగళవారం ఫైనల్ అయ్యాయని ప్రిన్సిపల్ డాక్టర్ విపి రాజు తెలిపారు. ఇందులో భాగంగా సిద్దిపేట ఇంటర్మీడియట్ విద్యార్థులు, ఇందూర్ కళాశాల విద్యార్థులు మొత్తం 10 టీములు పాల్గొన్నారు. ఇందులో ఫైనల్‌గా పోటీపోటీగా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ సిద్దిపేట, గరవర్నమెంట్ జూని యర్ కాలేజీ మిరుదొడ్డి విద్యార్థులు పాల్గొన్నారు. సిద్దిపేట కాలేజ్ విద్యార్థులు మొదటి స్థానంలో మిరుదొడ్డి కాలేజీ విద్యార్థులు రెండో స్థానంలో గెలు పొందారు. మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌గా మిరుదొడ్డి కాలేజీ నిలిచింది. విజేతలలో విన్నర్‌కు రూ.5 వేల రివార్డు, మెమోంటో, రన్నర్‌కి రూ.2500 రివార్డు, మెమోంటో, మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌కు రూ. వెయ్యి రివార్డు, మెమోంటోలను డాక్టర్ విపి రాజు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బెనర్జీ, బొడ్డు రఘు, ఫిజికల్ డైరెక్టర్ సంతోష్, ఎండి సల్మాన్,పోచయ్య, మహేష్ పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ

హత్నూర ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హత్నూర మండలం కాసాల గ్రామ రైతు వేదికలో సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో భాగంగా ఉద్యాన పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా కూరగాయల పండ్ల తోటలసాగు, చీడపీడల నివారణ, అధిక దిగుబడులు పొందుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పండ్ల తోటల యాజమాన్యం, పండ్ల తోటలలో సమగ్ర సస్యరక్షణ మరియు ఉద్యాన శాఖ ద్వారా అమలు చేయబడుతున్న పథకాలు, ఆయిల్ పామ్ సాగు వాటి వివరాలు వివరించారు.ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్ , డాక్టర్ సరిత , మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ , అందోల్ జోగిపేట్ ఏ డి ఏ రమాదేవి , మండల ఉద్యాన అధికారి సమత, ఏఈఓ లు మహేందర్, రమేష్, గోద్రెజ్ ఆయిల్ పంప్ ఎంప్లాయ్ శివరాం, రైతులు బుచ్చిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి దేవయ్య శ్రీధర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్

పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న కాంగ్రెస్ నేతలు

కొల్చారం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: మండలపరిధిలోని కొంగోడు గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లిని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, టీపీసీసీ మైనార్టీ సెల్ కార్యదర్శి హకీమ్ దర్శించుకున్నారు. అలాగే పోతంశెట్టిపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుక మాత ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘం పెద్దలు గంప లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, హకీమ్‌లను శాలువాలతో సన్మానించారు. అలాగే పోతంశెట్టిపల్లి గౌడ సంఘం అధ్యక్షులు కొమ్ముల రాజాగౌడ్ శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి, రేణుక మాత దీవెనలు అందరిపై ఉండి ప్రజలు సుఖశాంతులు, పాడిపంటలతో చల్లగా ఉండాలని వేడుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ట్రెజరర్ చందాపురం మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మారెల్లి అనిల్, మండల సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది నర్సింలు, కొంగోడు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివకుమార్ గౌడ్, కొత్తపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డమీద రాములు, స్వామి, గౌడ సంఘం నాయకులు అంజా గౌడ్, జోగిపేట విట్టల్ గౌడ్, ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ కొప్పుల యేసు రాజు, మహేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రియా జాలి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు హరీష్ వర్ధన్, చిన్నఘనపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మీపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రేణుక మాత భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

కొల్చారం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్‌ల సమక్షంలో రాంపూర్ గ్రామ బీఆర్ఎస్ యువ నాయకులు నెల్లిరాజు ముదిరాజ్, సంఘం అధ్యక్షులు, మాజీఅధ్యక్షులు ఆకుల మధు, నాయకులు కొట్టాల మధు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్‌లు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని ముందు ఉంచాలని పార్టీలో చేరిన నాయకులకు, కాంగ్రెస్ పెద్దలు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, దాకం యాదగిరి, ప్రజా సంఘం నాయకులు కాశం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చందాపురం రెడ్డి, అప్పాజీపల్లి మాజీ సర్పంచ్ సునీత వెంకట్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మరెల్లి అనిల్, ఎల్లుగారిగారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచి గడ్డమీది నర్సింలు, సీనియర్ నాయకులు గడ్డమీద రాములు, జోగిపేట విట్టల్ గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సయ్యద్ అక్రమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం : ఉప్పల ప్రవీణ్

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త): అన్నదానం మహాదానమని కాంగ్రెస్ నాయకుడు ఉప్పల ప్రవీణ్ అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణం లోని అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్, ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షుడు అయిత సత్యనారాయణ సౌజన్యంతో పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల ప్రవీణ్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రతి మంగళవారం పులిహోర పంపిణీ కార్యక్రమం చేపడుతున్న హనుమాన్ భక్త బృందంను, నోముల మహేందర్‌ను అభినందించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి, సేవాభావం కలిగివుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల భద్రయ్య, నోముల మహేందర్, కైలాస ప్రశాంత్, సంతోష్, దూబకుంట లక్ష్మణ్, మల్యాల వెంకటేశం, శ్రీహరి, విజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి న్యాల్‌కల్‌లో జాతర ఉత్సవాలు

వారం రోజులు దర్గా వద్ద సందడే సందడి..కుస్తీ పోటీల్లో 4 రాష్ట్రాల మల్లయోధులు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: వారం రోజుల పాటు లక్షలాది మంది భక్తులు (కులమతాలకతీతంగా) హాజరయ్యే న్యాల్‌కల్ గ్రామ శివారులోని హజరత్ పీర్‌గైబ్ సాహెబ్ జాతర ఉత్సవాలు ఈ నెల 7వ తేదీన ప్రారంభమై 14వ తేదీ వరకు కొనసాగనున్నట్లు దర్గా కమిటీ బాధ్యులు పేర్కొన్నారు. 7న రాత్రి 8 గంటలకు న్యాల్‌కల్‌లో మాలి పటేల్ ఇంటి నుంచి సర్కారి గంధం ఊరేగింపు, 8 కూరగాయల సంత,న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్ మండలాల్లోని గ్రామాల నుంచి దర్గా వరకు గంధం ఊరేగింపు, 9వ తారీఖున పశువుల సంత, జాతరకు చేరుకున్న మేలైన పశువులకు న్యాల్‌కల్ గ్రామానికి చెందిన కీర్తిశేషులు హోతి అడివప్ప, గిరిజాబాయి, హోతి సురేష్‌ల జాపకార్థం కళాకారుడు, రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులచే అవార్డు గ్రహీత హోతి బస్వరాజ్ మేలైన పశుపోషకులకు ప్రోత్సాహకాలు అందచేస్తారన్నారు. రాత్రి హద్పూర్ గ్రామం నుంచి గంధం ఊరేగింపు, ఖవాలి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 10న న్యాల్‌కల్ నుంచి ఖరేషి వారి గంధం ఊరేగింపు, దర్గ వద్ద ఖవాలి కార్యక్రమాలు ఉంటాయన్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి గంధం ఊరేగింపు కార్యక్రమాలు దర్గా వరకు నిర్వహిస్తాన్నారు. 11న ఉదయం 9 గంటల నుంచి అంతర్ రాష్ట్ర కుస్తీపోటీలు ఉంటాయని, విజేత మల్లయోధులకు రూ. 30 వేలు ఎస్‌వి ఫంక్షన్ హాల్ నిర్వాహకులు శుక్లవర్ధన్‌రెడ్డి, సయ్యద్ షకీల్ రూ.20,051, 11 తులాల వెండిని మాజీ జడ్పీటిసి సభ్యురాలు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, 10 తులాల వెండిని తాజా మాజీ జడ్పీటిసి సభ్యురాలు బోడ స్వప్న భాస్కర్, 5 తులాల చొప్పున వెండిని వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ ఎం.సిద్దిలింగయ్యస్వామి, పడకంటి వెంకట్, అబ్దుల్ ఖాదర్ ఖురేషి, పెద్దగొల్ల జగన్నాథ్‌లు కుస్తీ పోటీల చివరి విజేతకు అందచేస్తారన్నారు.

కుస్తీ పోటీల్లో తెలంగాణ, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రాల నుంచి మల్లయోధులు పాల్గొంటారన్నారు.12న కూరగాయల సంత, 13న రాత్రి 9 గంటలకు ఖవాలి, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న జాతర ఉత్సవాల చివరి రోజున భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాతర ఉత్సవ నిర్వాహక కమిటీ బాధ్యులు పేర్కొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఫొటో వీడియోగ్రఫీ కార్యవర్గ సభ్యులు

ఫొటో వీడియోగ్రఫీ అధ్యక్షుడిగా బీరప్పయాదవ్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన ఫొటో వీడియోగ్రఫీ నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఓటింగ్‌లో నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని 34 మంది ఫొటో వీడియోగ్రాఫర్‌లు పాల్గొన్నారు. ఈ ఓటింగ్ ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు.ఎన్నికల అధికారులుగా డేవిడ్, పూర్ణచందర్, వీరేశం, శేఖర్ వ్యవహరించారు. ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు బరిలో నిలవగా నారాయణఖేడ్‌కు చెందిన బీరప్పయాదవ్(అంజి ఫొటోస్టూడియో) పది ఓట్లతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్, కోశాధికారిగా దత్తుగౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, ప్రచారకార్యదర్శిగా మనోజ్,దత్తు, సలహాదారులుగా సుధాకర్, సురేష్, అనిల్‌లను నియమించారు. సంగారెడ్డి జిల్లా ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అధ్యక్షులుగా సుప్పాల శ్రీనివాస్ వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, బాలరాజ్, కంది బాలు, గౌస్, డేవిడ్ తదితరులు ఉన్నారు.

సర్పంచుల అరెస్టు అప్రజాస్వామికం

పోలీసులు అరెస్టు చేసిన మాజీ సర్పంచులు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త: తాజా మాజీ సర్పంచులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు పూలపల్లి యాదగిరి యాదవ్ అన్నారు. సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ(నేడు) తేది ఛలో సచివాలయం ముట్టడికి సర్పంచుల సంఘం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ముట్టడిలో భాగంగా భాగ్యనగరానికి వెళ్లకుండా మండల వ్యాప్తంగా మంగళవారం తాజా మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, పెండిగ్ బిల్లులు విడుదల చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో తమను ఆపలేరని, ప్రభుత్వం పై పోరాడుతామని తెలిపారు. మాజీ సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి,ప్రభాకర్‌లు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన వార్డు మాజీ సభ్యులు

నూతన మున్సిపల్ కమిషనర్‌ను కలిసి మాజీ వార్డు సభ్యులు

జిన్నారం, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త: జిన్నారం మండలం గడ్డపోతారం నూతన మున్సిపల్ కమిషనరు జేత్రంనాయక్‌ను గడ్డపోతారం గ్రామ మాజీ వార్డు సభ్యుడు వీరేశంగౌడ్. గ్రామస్తులు ప్రదీప్‌రాజు నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కమిషనర్ జేత్రం నాయక్‌ను ఘనంగా శాలువాతో సన్మానించారు.

న్యాల్‌కల్‌లో బేటీ బచావో బేటీ పడావో

న్యాల్‌కల్‌లో బేటీ బచావో-బేటీ పడావోలో పాల్గొన్న విద్యార్థినులు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో మంగళవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా లింగ నిర్ధారణ, ఆడపిల్ల ప్రాముఖ్యత, ఆరోగ్యం, రక్తహీనత నివారణలపై అవగాహన కల్పించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఋతుక్రమ పరిశుభ్రత కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, విద్యా ప్రాముఖ్యతపై వివరించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థుల, ఆశ వర్కరలచే ప్రతిజ్ఞ చేయించారు. బాలికల పేరుతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీఓ అంజమ్మ, పిహెచ్‌సి డాక్టర్ అమృతరాజ్,పల్లవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనిత, జెండర్ స్పెషలిస్టు విశాల, ఆసుపత్రి, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, విద్యార్